దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు

- మార్చి 2 నుంచి 10వ తేదీ వరకూ ఉత్సవాల నిర్వహణ
- త్వరలో రథశాల నిర్మాణం

పాలకొల్లు అర్బన్: స్థానిక యడ్లబజారులో వేంచేసి యున్న కనకదుర్గా మల్లేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవ పోస్టర్‌ను సోమవారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. మార్చి 2 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే అంగరంగ వైభవంగా నిర్వహించనున్న అమ్మవారి కల్యాణోత్సవాలు విజయవంతం చేయాలని ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, సభ్యులు కోరారు.

భక్తుల సౌకర్యార్థం ఆలయ పరిసరాల్లో ప్రత్యేక గదుల నిర్మాణం

అమ్మవారి ఆలయంలో కల్యాణాలు నిర్వహించుకునే భక్తుల కోసం ఆలయ వెనుక భాగంలో రెండు ప్రత్యేక గదులను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు చైర్మన్ శ్రీనివాసరావు వివరించారు.


పాలకొల్లులో దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవ పోస్టర్ ఆవిష్కరించిన ట్రస్ట్ బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు తదితరులు

కల్యాణోత్సవ ఏర్పాట్లలో భాగంగా ఆలయానికి రంగులు వేసి సుందరంగా ముస్తాబు చేస్తున్నామన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు ట్రస్టీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు తరలివచ్చి కనకదుర్గా మల్లేశ్వరస్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించి, అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు. చింతలపూడి వైఎస్సార్ సీపీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు బహూకరించిన రథానికి త్వరలో రథశాల నిర్మిస్తున్నట్లు శ్రీనివాసరావు వివరించారు. త్వరలో ఆలయ పరిసర ప్రాంతాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఈవో ఎస్ సతీష్‌కుమార్, ఆలయ ట్రస్టీలు నుదురుపాటి శ్రీనివాసరావు, కెల్లా పెద్దిరాజు, గుండుబోయిన అరుణకుమారి, రేలంగి నరసింహమూర్తి (దున్ను), వైసీపీ వార్డు ఇన్‌చార్జ్ గుండుబోయిన నాగేశ్వరరావు, అర్చకులు మోగంటి వెంకటరమణ, ఆలయ సిబ్బంది చిట్టి రాంబాబు, కె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో ఫ్లెక్సీల తొలగింపు


మొగల్తూరులో ఫ్లెక్సీలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

మొగల్తూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో గ్రామాల్లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. అధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో గతంలో ఏర్పాటు చేసిన వివిధ పార్టీ నాయకుల భారీ కటౌట్లు, ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ఏ రాజకీయ పార్టీ నాయకులు కూడా పెక్సీలు ఏర్పాటు చేయరాదని అధికారులు తెలిపారు.

సరోజినీ నాయుడికి ఘన నివాళి


సరోజినీ నాయుడికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సరోజినీ నాయుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ మాట్లాడుతూ భారత కోకిలగా పేరొందిన సరోజినీ నాయుడు ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలని అన్నారు. భారతదేశ తొలి గవర్నర్‌గా పనిచేశారన్నారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాలులర్పించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రిమూర్తులు, చంద్రకళ, భవానీ, దుర్గ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం


పెనుగొండలో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న సీఐ జీవీవీ

పెనుగొండ: మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం చేస్తాయని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అన్నారు. పెనుగొండ చైతన్యలో సోమవారం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎందరో క్రీడాకారులు ఉన్నారన్నారు. పాఠశాల స్థాయి నుంచి వీరిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. చదువుతో పాటు, క్రీడల్లోనూ విద్యార్థులకు ఆసక్తి చూపేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్, ప్రిన్సిపాల్ బి బాలాజీ, ఏజీఎం వైఎస్ శ్రీనివాస్, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళలకు రాజకీయ అంశాలపై శిక్షణ


ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పోగాక పూర్ణ

తాడేపల్లిగూడెం: మహిళలు రాజకీయంగా చైతన్యవంతం కావాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పోగాక పూర్ణ పిలుపు నిచ్చారు. సోమవారం తాడేపల్లిగూడెంలో నిర్వహించిన అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 25,26 తేదీల్లో మహిళలను రాజకీయంగా చైతన్యపర్చడానికి తాడేపల్లిగూడెంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో బంకుల యశోద, సీహెచ్.వరలక్ష్మి, అడ్డాల మీనాకుమారి, హేమలత పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకోవాలి

పెంటపాడు: విశ్వాసులకు దేవుని వాఖ్యాన్ని సులువుగా బోధించేందుకు దైవ సేవకులు కృషి చేయాలని యూపీఎఫ్ సంస్థ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. చింతపల్లి జెకర్యా ప్రార్థనా మందిరంలో సోమవారం సంఘ కాపరి మల్లిపూడి సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధ్యాత్మిక జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న సంస్థ అధ్యక్ష, గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు, బిషప్ ఐజక్ ముగ్గళ్ల తదితరులు బోధకులకు దేవుని వాక్యం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఉపాధి పనులు


రామన్నపాలెంలో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు ఊపందుకున్నాయి. మొగల్తూరు, శేరేపాలెం, కొత్తపాలెం, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీపాలెం గ్రామాల్లో పంట బోదెల తవ్వకాలతో పాటు డిస్ట్రిబ్యూటరీ ఛానల్స్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క, పూడిక తొలగింపు పనులు చేపట్టారు. వీటితో పాటు రహదారులకు ఇరువైపునా మొక్కలు నాటుతున్నట్టు ఏపీవో శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి


స్పందన కార్యక్రమంలో సమస్యలు తెలుసుకుంటున్న నరసాపురం సబ్ కలెక్టర్ సూర్యతేజ

నరసాపురం: స్పందన కార్యక్రమంలో అందిన ఫిర్యాదులు, విజ్ఞప్తులపై అధికారులు తక్షణం స్పందించి సమస్యలు పరిష్కరించాలని నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు మొత్తం 39 ఫిర్యాదులు అందించినట్టు సబ్ కలెక్టర్ చెప్పారు. హౌసింగ్, భూతగాదాలు తదితర అంశాలపై ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా ప్రజల సమస్యలను నేరుగా తెసుకుని వాటిని సత్వరం పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో స్పందన నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అధికారులు స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ముందుగా మండలస్థాయిలో అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. స్పందన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తానని చెప్పారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారం విషయంలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

పెనుగొండ: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కిల్ హబ్ ద్వారా ఆచంట ప్రభుత్వ ఐటీఐలో నెల 15 నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ యిందుకూరి వెంకటసత్యనారాయణ రాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ ఇంజనీరు, ఎయిర్ కండీషనర్ కోర్సులకు సంబంధించి మూడు నెలల నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణతో పాటు ఇంగ్లీషు, కంప్యూటర్స్, ఇంటర్వ్యూ, స్కిల్స్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 30 ఏళ్ల లోపు వారు 8, 9, 10వ తరగతి, ఇంటర్ పాస్ లేక ఫెయిల్, ఐటీఐ డిప్లొమా పూర్తయినవారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సెల్ : 6304922617, 9573528272 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీ విజేతలతో ఉపాధ్యాయులు

పాలకొల్లు సెంట్రల్: కరాటే పోటీల్లో భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు ప్రతిభచూపారని ప్రధానోపాధ్యాయిని డి భవానీ తెలిపారు. ఆదివారం నిడదవోలు రంగా సుబ్బారావు, సత్యవతి కాపు కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి గోజో రియో ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2023 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి ఎస్ షారోని, ఎమ్ మోహిత్, పి ఫరీనా, ఎమ్ రోహిత్, ఎస్ కోమల, ఎ రమ్య ఆరుగురు బంగారు పతకాలు, ఎమ్ మహేష్, జి రాహుల్ రజత పతకాలు గెలుపొందినట్లు భవానీ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులను, కోచ్ కె రాజును సోమవారం డైరెక్టర్ ఎస్ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం


ఏఐటీయూసీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం: కార్మికుల సమస్యలు పోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయని పలువురు నాయకులు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక తాపీ, వడ్రంగి, సెంట్రింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి అధ్యక్షుడు పడాల శ్రీనివాసు అధ్యక్షత వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో కొనసాగుతున్న భవన నిర్మాణ కార్మికులకు కనీస వేతనాలు, పని ప్రదేశంలో భద్రత, ఆరోగ్య పరిరక్షణ, పనిచేయలేని వృద్ధ కార్మికులకు పింఛన్ కోసం యూనియన్ పోరాడుతోందన్నారు. జిల్లా అధ్యక్షుడు పాలూరి లక్ష్మణరావు మాట్లాడుతూ నిర్మాణ సామగ్రి ధరల పెరుగుదల వల్ల నిర్మాణ రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, అంకం భాస్కరరావు, మెండెం జేమ్స్, రాజా వెంకటరావు పాల్గొన్నారు.

మండపాకలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం


మండపాక ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించినట్లు రేలంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బంగారు రవి చెప్పారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాకలోని యల్లారమ్మ గుడి వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో మంచం మీద నుంచి లేవలేని వారికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ వీ రాణి, ఎంపీహెచ్ఎస్ జయరాజు, ఎంపీహెచ్ఏ వైటీ మూర్తి, సుధా, అనురాధ, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చైర్‌పర్సన్ వెంకటరమణ, కౌన్సిలర్ శ్యామల

నరసాపురం: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో మెనూ సక్రమంగా అమలు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం చైర్‌పర్సన్ పట్టణంలోని 30వ వార్డు స్టేషన్‌పేట ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల బోధన, తరగతి గదుల్లో సౌకర్యాలు, మధ్యాహ్న భోజనంలో మెనూ అమలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద, మధ్య తరగతి పిల్లలకు పౌష్టికాహారం పాఠశాలల్లోనే అందించాలనే ఉద్దేశ్యంతో ప్రత్యేక మెనూతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందన్నారు. ఈ పథకం నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని సూచించారు. స్థానిక కౌన్సిలర్ అడిదల శ్యామల తదితరులు ఉన్నారు.

సక్రమంగా మందులు వాడితే కుష్టు వ్యాధి నయం


ఉల్లంపర్రు సత్యసాయి కాలనీలో కుష్టు రోగులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: సక్రమంగా మందులు వాడి, పౌష్టికాహారం తీసుకుంటే కుష్టు వ్యాధి పూర్తిగా నయమవుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అన్నారు. రోటరీ, ప్రభుత్వం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహించిన స్పర్శ (కుష్టు నివారణ) పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉల్లంపర్రు సత్యసాయి కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో అవగాహన లేకపోవడం వల్ల రోగులు వికలాంగులుగా మారి ప్రతిరోజు అనేక ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొంటూ జీవించేవారన్నారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రాంప్రసాద్ మాట్లాడుతూ ఎండీటీ మందులు వచ్చిన తరువాత కుష్టువ్యాధి పూర్తిగా అదుపులో ఉందన్నారు. రోగాన్ని తొలిదశలోనే గుర్తించి ఎండీటీ మందులు వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి బాధితులను సన్మానించారు. కుష్టువ్యాధిగ్రస్తులకు బిర్యానీ పాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఎం భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సజన, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతం, భగవద్గీతపై విస్తృత ప్రచారం


ఎల్బీచర్లలో త్రైతసిద్ధాంతంపై ప్రచారం నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

నరసాపురం రూరల్: ఆధ్యాత్మిక విద్యలో విప్లవాత్మక మలుపు తిప్పిన భవద్గీతలో మూడు ఆత్మలపై త్రైత సిద్ధాంత భగవద్గీత శాస్త్రీయంగా వివరించి బోధించిందని సిద్ధాంత ప్రబోధ సేవా సమితి మామిడి కుదురు కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. గురువు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత గ్రంథాలను దైవ జ్ఞాన ప్రచారంలో భాగంగా గీతా జయంతి మాసాన్ని పురస్కరించుకుని గ్రామస్తులకు అందించారు. త్రైత సిద్ధాంతంలోని అంశాలను ప్రజలకు తెలియజేయడమే ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సభ్యులు హనుమంతరావు, బ్రహ్మజీ, సత్యవతి, చంటి, రమేష్ పాల్గొన్నారు.

తిరునాళ్లలో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


ఆచంటేశ్వర స్వామి ఆలయంలో సమీక్షలో సీఐ జీవీవీ నాగేశ్వరరావు

పెనుగొండ: ఆచంటలో ప్రసిద్ధి గాంచిన ఆచంటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిర్వహించే తిరునాళ్లలో ఆకతాయిలు ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని పెనుగొండ సీఐ జీవీవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం ఆచంటేశ్వర స్వామి తిరునాళ్లపై కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేసామని తెలిపారు. ఉత్సవాలు సజావుగా సాగేందుకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. కమిటీ సభ్యుల సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కోట వెంకటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

15న వాహనాల వేలం

పాలకొల్లు అర్బన్: ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు ఎస్సై కె శ్రీనివాస్ తెలిపారు. రెండు హోండా యాక్టివాలు, ఆటోకు వేలం పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల వారు వేలం పూర్తయిన వెంటనే సొమ్ము చెల్లించి వాహనాలను పొందాలని ఎస్సై తెలిపారు.

బాలికలకు ఆరోగ్య పరీక్షలు


విద్యార్థినులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

పెంటపాడు: బాలికలలో రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్యాంబాబు పేర్కొన్నారు. పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థినులకు కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు చేశారు. పెంటపాడు ఆరోగ్యశాఖ సిబ్బంది రక్తహీనత నివారణకు మందులు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మచారి, గణిత అధ్యాపకులు ఆర్కే ఫణిధర్, ఎన్ఎస్ఎస్ అధికారి విజయబాబు, లెఫ్టినెంట్ ప్రేమ్ సాగర్, డాక్టర్ గంధం వాణికుమారి జాన్‌బాబు, పాల్గొన్నారు.

తాళ్లకోడు లేఅవుట్ పరిశీలన

ఆకివీడు: మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని 74 ఎకరాల జగనన్న లేఅవుట్‌ను సోమవారం భీమవరం ఆర్డీఓ దాసి రాజు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సమతా నగర్‌లోని స్పందన ఫిర్యాదును పరిశీలించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వ భూమిలో నడక దారిని లేకుండా చెరువుదారులు ఆక్రమించారని ఫిర్యాదుపై ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు గృహ సారథులతో సమావేశం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన గృహ సారథుల సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు తెలిపారు. ఉదయం పేరుపాలెం నార్త్, సౌత్, కేపీపాలెం నార్త్, సౌత్, వారతిప్ప, మోడి గ్రామాలకు సంబంధించి సమావేశం పేరుపాలెం సౌత్-1 సచివాలయంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3గంటలకు ముత్యాలపల్లి, కొత్తోట, కాళీపట్నం తూర్పు, పడమర, జగన్నాథపురం, పాతపాడు, కోమటితిప్ప గ్రామాలకు సంబంధించి కాళీపట్నం పడమరలో సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశాలకు ఆయా గ్రామాలకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

ఎఫ్‌డీవోగా ఎంపికైన ముత్యాలపల్లి యువతి


ఎఫ్‌డీవోగా ఎంపికైన కొల్లాటి భారతి

మొగల్తూరు: ముత్యాలపల్లికి చెందిన కొల్లాటి భారతి రాష్ట్ర మత్స్య శాఖలో మత్స్యశాఖాధికారిగా ఎంపికయ్యారు. ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ ఆలయ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడైన కొల్లాటి రామారావు, పార్వతి దంపతుల కుమార్తె ఎంఎఫ్ఎస్సీలో విద్యనభ్యసించారు. రాష్ట్ర ప్రభుత్వం 2021లో మత్స్యశాఖలో ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల చేయగా దరఖాస్తు చేసుకున్న ఆమె 2022లో నిర్వహించిన పరీక్షలకు హాజరయ్యారు. దీంట్లో ఉత్తీర్ణత సాధించడంతో ఈనెల ఫిబ్రవరి 10న మత్స్యశాఖ శాఖ నుంచి ఎఫ్‌డీవోగా అర్హత సాధించినట్లు సమాచారం అందడంతో తల్లిదండ్రులతో పాటు, గ్రామస్తులు, పార్టీ నాయకులు భారతిని అభినందించారు. ఈనెల 21న అమరావతిలోని మత్స్యశాఖ కార్యాలయంలో రిపోర్టు చేయనున్నట్లు భారతి తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పెనుగొండ: పంచాయతీలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకుడు ఎస్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేయాలి

కోడి పందేల దిబ్బలో కాలనీ వాసులకు రేషన్ సరకులు అందించాలని తహసీల్దారు జి గురుమూర్తి రెడ్డికి సీపీఎం నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాదాసు నాగేశ్వరరావు, ఎస్ వెంకటేశ్వరరావు, షేక్ పాదుషాలు పాల్గొన్నారు.

ఇంటి స్థలం కోసం స్పందనలో అర్జీ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి స్థలం మంజూరు చేయాలంటూ దండగర్ర నుంచి అర్జీ అందిందని ఎంపీడీవో ఎం.వెంకటేష్ తెలిపారు. తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యువత సమాజ సేవల్లో పాల్గొనాలి

తాడేపల్లిగూడెం: విద్యార్థి దశ నుంచి యువత దేశ భక్తి కలిగి, సమాజ సేవల్లో భాగస్వాములవ్వాలని ఉండాలని వశిష్ట లియో క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జాతీయ మహిళా దినోత్సవంలో క్లబ్ అధ్యక్షురాలు మాధురి అన్నారు. క్లబ్ ద్వారా విద్యార్థినులకు ఆహార పొట్లాలు అందించారు. పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో క్యాన్సర్ రహిత శానిటరీ న్యాప్‌కిన్స్ అందజేశారు. లియో సభ్యులు ప్రమీల, అంబికా, సాయిశృతి, అమృత, రెడ్డి నందిని తదితరులు పాల్గొన్నారు.